
# అడుగడుగునా తనిఖీలు


యాచారంలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

తాండూరు, అక్టోబర్ 12: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తాండూరులో పోలీసుల తనిఖీలు ముమ్మరమయ్యాయి. గురువారం తాండూరు విలేమూన్ స్కూల్ సమీంలో రూ.2.50 లక్షలు, వినాయక చౌక్‌లో రూ.5,46,620 పట్టుకున్నారు. వారి దగ్గర సరైన ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. స్క్రీనింగ్ కమిటీ ముందు ప్రొడ్యూస్ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### రూ. లక్ష స్వాధీనం

యాచారం, అక్టోబర్12: మండలంలో నల్లగొండ-రంగారెడ్డి సరిహద్దు ప్రాంతమైన మాల్‌లో సాగర్‌రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. బుధవారం రాత్రి ఓ వ్యక్తి దగ్గర నుంచి రూ.1,00,000 పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మాల్, యాచారం, మీర్‌ఖాన్‌పేట గ్రామాలలో ఎస్ఐ వెంకట నారా యణ, ఎస్ఐ సత్యనారా యణ, ఎస్ఐ నరేశ్‌ల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. వాహనాలలో లెక్కకు మించి నగదు, బంగారం ఉంటే పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆధారాలు లేకుంటే వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు.

### రూ.60 వేల నగదు సీజ్

తాండూరు రూరల్, అక్టోబర్ 12: తెలంగాణ - కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రూ.60,600 నగదును పోలీసులు గురువారం సీజ్ చేశారు. తాండూరు మండలం, కొత్లాపూర్ చెక్‌పోస్టు వద్ద కరణ్‌కోట పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. కర్ణాటకలోని కల్లూరుకు చెందిన విజయ్‌కుమార్ తాండూరు వైపు బైక్‌పై వస్తుండగా, కొత్లాపూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించగా, రూ.60,600ల నగదు దొరికినట్లు ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నగదును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలి

కులకచర్ల, అక్టోబర్ 12 : ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా బీఎల్వోలు విధులు నిర్వహించాలని కులకచర్ల తహసీల్దార్ మురళీధర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌కుమార్ అన్నారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో రాజకీయాలకు సంబంధించిన బ్యానర్లు, గోడపోస్టర్లు ఉండకూడదని, ఈ విషయంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గ్రామాల్లో బీఎల్వోలు విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరించే ఏ సమాచారమైనా తమకు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల మండల బీఎల్వోలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీధర్



చేవెళ్లటౌన్, అక్టోబర్ 12: పోలీసుశాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ, చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు తెలిపారు. చేవెళ్ల ట్రాఫిక్ ఏఎస్సైగా పని చేస్తున్న చంద్రనాయక్ బదిలీ కావడంతో గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ బోస్‌కిరణ్, చేవెళ్ల ట్రాఫిక్ ఎస్సై విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎంలో చోరీకి యత్నం



కులకచర్ల, అక్టోబర్ 12 : మద్యం మత్తులో యువకుడు ఏటీఎం చోరీకి యత్నించిన ఘటన కులకచర్ల మండల కేంద్రంలో జరిగింది. ఘనాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ (22) మండల కేంద్రంలోని పెద్దగేటు చౌరస్తాలో ఉన్న ఇండియా 1 ఏటీఎంలో సాయంత్రం 5.30 ప్రాంతంలో ఏటీఎం దగ్గరకు వెళ్లి డబ్బులు తీస్తున్నట్లుగా ప్రయత్నించాడు. కొద్దిసేపటి తరువాత ఏటీఎం మరమ్మతులు నిర్వహి స్తున్నట్లుగా ఏటీఎం షటర్‌ను సగభాగం వరకు మూసీ మిషన్‌లోని డబ్బుల భాగాన్ని బయటకు తీస్తున్న క్రమంలో స్క్రీన్ భాగం ఒక్కసారిగా కింద పడి పెద్దగా శబ్దం వచ్చింది. పక్కనే ఉన్న స్థానికులకు అనుమానం వచ్చి చూడగా ఏటీఎంలో విరిగి పడిన విడిభాగాలను చూసి వ్యక్తిని గుర్తించి పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## మల్లాపూర్‌లో పోలీస్ మార్చ్




కొత్తూరు, అక్టోబర్ 12: మండల పరిధిలోని మల్లాపూర్‌లో కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి గురువారం ఫుట్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల పట్ల ప్రజల్లో విశ్వాసం నింపేందుకు ఈ పాదయాత్ర ఉపకరిస్తుందని తెలిపారు. అంతే కాకుండా మల్లాపూర్ గామంలో ప్రజలతో సంభాషించామని వివరించారు. పాదయాత్రలో ఎస్‌లు జి. శ్రీనివాస్, కే. శ్రీనివాస్, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పత్తి పంట సాగుపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త లక్ష్మి

పూడూరు, అక్టోబర్ 12: పత్తి రైతు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయాలని వ్యవసాయ పరిశోధన స్థానం తాండూరు అధిపతి డాక్టర్ సి.సుధారాణి తెలిపారు. గురువారం పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఏరువాక కేంద్రం తాండూరు వారి ఆధ్వర్యంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ వారు రైతులకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, కలుపు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో పరిగి డివిజన్ వ్యవసాయధికారి లక్ష్మికుమారి ఉన్నారు.

## విద్యార్థి అదృశ్యం



దోమ, అక్టోబర్ 12: విద్యార్థి అదృశ్యమైన ఘటన దోమ పోలీసు స్టేషన్ పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో జరిగింది.ఎస్సై రవిగౌడ్, విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పద్మమ్మ, నర్సిం హులు దంపతుల కుమారుడు దొడ్ల రాఘవేందర్ దోమ ఎస్సీ హాస్టల్ లో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల (బాయిస్)లో 8వ తరగతి చదువుతు న్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో లీవ్ లెటర్ రాసి పెట్టి మల్లేపల్లికి వచ్చాడు. తిరిగి సోమవారం పాఠశాలకు హాజరై పరీక్ష రాసిన అనంతరం పెట్టె తాళం మర్చిపోయానని తోటి విద్యార్థులతో చెప్పి మళ్లీ ఊరికి వెళ్లి తాళం తీసుకొని అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయం లో ఇంట్లో తాళం తీసుకొని హాస్టల్‌కు వెళుతున్నట్లు చెప్పి బయలుదేరాడు. మరుసటి రోజు అదే హాస్టల్‌లో ఉంటున్న నెత్తి నరేశ్ అనే విద్యార్థి రాఘవేందర్ హాస్టల్‌కు రాలేదని తెలుపడంతో హాస్టల్ వార్డెన్ శంకర్‌ను అడుగగా రాలేదని తెలిపారు. గురువారం విద్యార్థి చిన్నాన దొడ్ల అంజిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బెల్టు దుకాణాలపై దాడి.. మద్యం స్వాధీనం


బొంరాస్‌పేట, అక్టోబర్ 12 : మండలంలోని ఏర్పుమళ్లలోని రెండు మద్యం బెల్టు దుకాణాలపై ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో దుకాణాలలో నిల్వ చేసిన 48 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### మంత్రి ప్రశాంత్‌రెడ్డి కుటుంబానికి

## మంత్రి మహేందర్‌రెడ్డి పరామర్శ

షాబాద్, అక్టోబర్ 12: మాతృ వియోగానికి గురైన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనుల శాఖల మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ప్రశాంత్‌రెడ్డి తల్లి వేముల మంజులమ్మ హఠాన్మరణానికి గురైన సమాచారం తెలుసుకున్న మంత్రి మహేందర్‌రెడ్డి వెంటనే నగరంలోని ఓ దవాఖానలో మంజులమ్మ భౌతిక కాయాన్ని సందర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి, ఆమె ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

### బీఆర్ఎస్ నేత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 12: సీనియర్ బీఆర్ఎస్ నేత దేసారం నందంగౌడ్ కుటుంబాన్ని ఇబ్ర హీం పట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి గురువారం పరా మర్శించారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు దేసారం రాఘవేందర్‌గౌడ్ సోదరుడు శివ గత నెల 12న మరణించాడు. ఇనాంగూడలోని ఆయన నివాసంలో కలిసి దేసారం నందంగౌడ్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బాట సింగారం రైతు సేవా సహకార సం ఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి కోట వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సీక సాయికు మార్ గౌడ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తిగౌడ్, అబ్దుల్లాపూర్ సర్పంచ్ చెరుకు కిరణ్ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల బాలశివుడుముదిరాజ్, గ్రామ పెద్దలు, కార్యకర్తలు ఉన్నారు.

### ఇంటి తాళాలు పగుల గొట్టి

## 22 తులాల బంగారం చోరీ

శంకర్‌పల్లి అక్టోబర్12: తాళాలు పగుల గొట్టి 22 తులాల బంగారం చోరీ చేసిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో నివా సం ఉంటున్న వంశీధర్‌రెడ్డి పని నిమిత్తం తాళాలు వేసి బయటకు వెళ్లగా దొంగలు తాళాలు పగులగొట్టి 22 తులాల బంగారం, లక్ష నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### మూగ బాలికపై

## వృద్ధుడు అత్యాచారయత్నం

పెద్దేముల్, అక్టోబర్ 12: మూగ బాలికపై వృద్ధుడు అత్యాచార యత్నం చేసిన ఘటన పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని తట్టేపల్లి గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ కాశీ నాథ్, బాధితురాలి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం..తట్టేపల్లి గ్రామానికి చెందిన బాలిక (11) ఇంటి వద్దనే ఉంటుంది. బాలిక తల్లిదండ్రులు రోజు మాదిరిగానే గురువారం కూడా మధ్యాహ్నం సమయంలో పొలం పనులకు పోయారు. బాలిక తమ్ముడు ఆడుకోవడానికి వెళ్లి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చే సరికి అతడికి అక్క కనబడలేదు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపాడు.పొలం నుండి వచ్చిన తల్లిదండ్రులు చుట్టూ పక్కల వెతుకుతుండగా అదే గ్రామానికి చెందిన ఓ మహిళ వారికి వృద్ధుడు(60) మీ కూతురుని తన ఇంటికి తీసుకెళ్లినట్లు చెప్పింది. వృద్ధుడి ఇంటి దగ్గర గల భవానీమాత టెంపుల్ దగ్గర బాలిక కూర్చొని ఉండగా ఇంటికి తీసుకొని వెళ్ళారు. ఏం జరిగిందని తల్లిదండ్రులు విచారించగా పైసలు ఇస్తానని చెప్పి ఆ వృద్ధుడు తనను ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడని తెలిపింది. బాధిత బాలిక తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును చేస్తున్నామని ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.